

# విరితావి

వి. వాణీప్రసాద్

సీతమ్మగారింట్లో విరగ పూచిన జాజి పూల పరిమళం గాలిలో తేలి కిటికీ వద్ద నిలబడి వున్న వసంతను హాయిగా, మృదువుగా చుట్టేసింది.

ఎదురింట్లో పూచిన జాజులను, అందంగా అల్లుకుంటున్న ఆ తీవెలను చూస్తూ నిలబడిన వసంత హృదయంలోనూ, మధురమైన ఊహలు పెనవేసుకుంటున్నాయి. చిలిపిగా గదిలోకి చొరబడాలని ప్రయత్నిస్తోంది వెన్నెల. ఆకులతో, రెమ్మలతో అలవోకగా ఆపినా, అల్లరిగా తాకే చిరుగాలికి సుగంధాన్నిస్తూ, దాంపత్య బంధానికి ప్రతీకగా నిలిచిపోయిన జాజి తీగంటే, ఆ సౌఖ్యంలో పొందే అనుభూతి అంటే వసంత కెంతో యిష్టం.

చిన్నతనంలో పల్లెటూరిలో. వాళ్ళ యింట్లో వుండే సన్నజాజి పందిరిపై అంతటి అపురూపమైన భావన ఉండేది కాదు వసంతకు. కేవలం ఆ పూలను మాత్రమే కురుల తురుముకునేది. తర్వాత తండ్రి ఉద్యోగరీత్యా మరో ఊరికి బదిలీ అయిన సమయానికి వసంత, వసంతా గమనంతో అందాలు సంతరించుకున్న అందమయిన అమ్మాయి.

ఎదురింటిలో గది ప్రక్కకు, కిటికీకి అతి సమీపంగ ప్రాకిన సన్నజాజి తీవె చూసినప్పుడల్లా, తనకంటూ ఓ గది, ఆ గది కిటికీ ప్రక్కగా సుగంధాన్ని విరజిమ్మే ఆ తీగను పెంచాలనే కోరిక ఆమెలో మొగ్గ తొడిగింది. కాని వారు వుండేదీ రెండు గదుల్లో; అందులో తనకంటూ ప్రత్యేకమైన గది మిగలదని, యింకొంచెం పెద్ద యిల్లు తీసుకునే ఉద్దేశం తండ్రికి లేదని తెలుసు. అందుకే తనకు, తండ్రి పెళ్ళంటూ చేస్తే, ఆ యింట్లోనైనా ... తన కోరిక తీరుతుందా? ఆ పూ పరిమళాన్ని ఆస్వాదిస్తూ. తనూ, తనభర్త అనుభవాల పూవులు పూయించకోగలరా? అనుభూతుల తావులు అందు కోగలరా? ఇలా వసంత హృదయంలో ఎన్నో ఆలోచనలు -- మరెన్నో ప్రశ్నలు. అవే ఆమెను మరో అందమయిన లోకంలో విహరింపచేసేది.

వసంత తండ్రి పద్మనాభరావుగారు ఎలిమెంటరీ స్కూల్ మాష్టర్. ఆయనకు వసంతకు ముందుగా మరో కూతురు – భాను. భానుకు పల్లెలో వున్న యింటిని అమ్మివేసి వచ్చినంతలో కట్నం యిచ్చి, ఓ గుమాస్తాతో పెండ్లి చేశారు. గుండెలపైనున్న ఒక కుంపటిని దింపుకున్నారు.

మరో కుమార్తె వసంత కోసం పైసా, పైసా కూడబెడుతున్నారు. తనకూ, భార్యకు, కూతురు అనే ఆ చిన్న సంసారం కోసం ఇల్లు అనబడే ఆ రెండూ గదులూ చాలనుకున్నారు. అందులో చేరారు.

ఇంకో సంవత్సరం నరకయినా వసంతనూ ఓ అయ్యచేతిలో పెట్టాలనేదే ఆయన తపన జీవిత, ధ్యేయం కూడ.

వసంత ఎదురింటి జాజిపందిరితోపాటే మరిన్ని ఊహలల్లుకుంటుండగానే పద్మనాభరావుగారి మిత్రుడు, ఆనందరావుగారి కొడుకు – రవి యింటర్వ్యూకోసం ఆ ఊరు వచ్చాడు. తండ్రి కోరిక ప్రకారం. రవి పద్మనాభరావుగార్ని కలుసు కున్నాడు. వసంతగానంవంటి వసంతను, పద్మనాభ రావుగారి స్థితిగతులను బేరీజు వేసుకుంటూ స్వగృహం చేరుకున్నాడు.

ఆ తర్వాత చేతికందిన ఆర్డరు ఆసరాగా "వసంతను చేసుకుంటాను" అని వచ్చి ఆ కుటుంబాన్ని ఆశ్చర్యంతో ముంచివేశాడు. ఆనందంతో తబ్బిబ్బుచేశాడు. రవితో తాను దాచిన డబ్బు ఎంతో, తాను ఏమేమి యివ్వలేడో చెప్పబోయిన పద్మనాభరావు గార్ని వారించాడు. "పెద్దతనంలో ఆ డబ్బే మీకు ఆసరా అవుతుంది, ఉంచండి" అంటు ఆయన్ని మరింత విభ్రాంతితో ముంచివేశాడు.

"దయచేసి మా స్థితిని చూసి జాలిపడిమాత్రం యీ వివాహం చేసుకోకండి" అని అభ్యర్థించిన వసంతతో, "వసంతా! నా జీవితంలోకి వసంతం నీ ద్వారానే రావాలి; నిన్ను చూసిన తొలి క్షణంలోనే నాకీ ఆశ కల్గింది. అందుకు, ఉద్యోగంలో చేరమని

నాకొచ్చిన ఆర్డరు బాసటగా నిల్చింది. తోడుగ నాన్నగారి అనుమతి లభించింది. నాకు తోడుగా వుంటానని చెప్పు వసంతా!'' అన్న రవికి చేయి అందించింది వసంత.

రవితో సరిక్రొత్త జీవితంలోకి అడుగుపెట్టిన వసంతలో అక్కడయినా తన కోరికను తీర్చుకోవాలనే ఉత్సాహం పెల్లుబుకింది.

క్రొత్త యింటిలో ప్రవేశించిన వసంతకు ఎటు చూచినా బండలు పరచిన నేలే కన్పించింది. కొంత నిరుత్సాహం చెందింది. అయినా తమ వాటాకు ప్రక్కగా రాళ్ళు లేచిపోయిన ప్రదేశంచూసి కొంచెం ఆనందించింది. క్రొత్తదనాన్ని, జంకును దాచు కుంటు, ఆ వీధిలో సన్నజాజి చెట్టువున్న వారింటికి వెళ్ళి తనకు తానుగా మాట కలిపింది. అలా రెండు మూడు సార్లు వారింటికి వెళ్ళి, పరిచయాన్ని పెంచుకుని ఆ యింటిని, పరిసరాలను, ముఖ్యంగ ఆ సన్నజాజి పందిరి శోభ నిచ్చిందటూ పొగిడింది. మాటలో మాటగా ''ఒక అంటు వుంటే యివ్వరూ ? !'' అని అడిగేసింది. ఆ ఇల్లాలు నవ్వుతూ ''అంటు కట్టింది లేదండి, కావాలంటే కట్టుకోండి'' అని ఆమె యిచ్చిన పర్మిషన్‌కు మహానందంతో అంటు కట్టేసింది, మరికొన్నాళ్ళకు రాళ్ళు లేచిపోయిన ఆ ప్రదేశంలోని పాత మట్టిని తీసివేసి, కొత్తమట్టి నింపి, ఆ 'అంటును' ఉత్సాహంగ నాటింది.

ఎలాగో ఆ జాజి బ్రతికి బట్టకట్టింది. అది మారాకు వేస్తుంటే వసంత హృదయంలో మొగ్గలు తొడిగినట్లే వుండేది.

వసంతలోని పొంగులువారే యీ ఉత్సాహం చూసి ''ఏమిటోయ్! దాన్నేదో గారాబం చేసేస్తు న్నావు?'' అని ఆటపట్టించేవాడు రవి.

ఆ సమయంలోనే, మామగారికి వంటో బాగులేదనే ఉత్తరం చూసుకుని భర్తతోపాటే ప్రయాణం కావల్సివచ్చింది వసంత.

కన్నబిడ్డను, మరో తల్లికి అప్పగించినట్లుగ; ఆ లేత జాజి మొక్కను ప్రక్క భాగం వారికి అప్పచెప్పి రవితో బయలుదేరింది.

మామగారు పూర్తిగా కోలుకున్నాక, తిరిగి వచ్చిన వసంతను తను నాటి, మారాకులు వేస్తున్న జాజి మొక్కకు మారుగా ఖాళీగొయ్యి వెక్కిరించింది.

''ఏమనుకోకు వసంతా ! చంటివాడు పీకేశాడు. నేనేదో పనిలో వుండిపోయాను'' అని ఆ చంటివాడిని ఎత్తుకొచ్చిన ఆ తల్లిని ఏమీ అనలేకపోయింది. 'నా జాజి అంటును నువ్వో యమకింకరుడివయ్యావు' అనుకుంటూ ఆ చంటివాడికేసి కోపంగా చూసింది వసంత. వాడు అలవాటుగా అల్లరిగా నవ్వేశాడు. వాడి బోసి నవ్వుకు కోపం పారిపోగా 'ఛ! యీ పసివాడినా యమకింకరుడనుకుంది' తను, అని బాధ పడుతూ చాచిన వసంత చేతుల్లో వాలిపోయాడు చంటి. ''ఏరా బాబూ! నీకూ ఆ పసిదానితో ఆడుకోవాలనిపించిందా ?'' అంది వసంత మనసు ఆర్ద్రమవుతుండగా.

* * *

ఆ తర్వాత మళ్ళీ ప్రయత్నించి మరో అంటు నాటింది వసంత. అది జీవాన్ని పుంజుకుని వసంత హృదయంలో ఆశలు చిగురింప చేస్తుండగానే రవికి అక్కడి నుండి ట్రాన్స్‌ఫర్ అయింది. ముందుగా యిల్లు చూసి వచ్చిన రవిని, ''ఇల్లు బావుందా ? ఖాళీ జాగా వుందా ?'' అని ఆత్రంగ ప్రశ్నించింది, వసంత. అక్కడయినా తనకోరిక నెరవేరుతుందేమో ననే ఆశతో.

''ఆగు! చూస్తే ఎగిరి గంతేస్తావు'' అంటూ వసంతను ఉడికించాడు రవి.

కాంపౌండులోకి ప్రవేశిస్తూనే ఒక మూలగా వున్న పెద్ద జాజి పందిరిని చూసి తనువు పులక రించింది వసంతకు.

''పద ! మనది మేడమీద గదులు'' అంటూ దారితీసిన రవిని అనుసరించి, ''మేడమీద గదులా'' అంటూ ఉసూరుమంది. ''అదేమిటి నీ కిష్టం లేదా ? యిలా మేడమీద గదుల్లో వుండటం నాకెంత యిష్టమో తెల్సా ? – సాయం సమయంలోని సంధ్యారాగాన్ని, అనంతాకాశంలో మెరిసే తారకలను, పౌర్ణమినాటి వెన్నెల జిలుగుల్ని యిలా ఎన్నో, ఎన్నో అందమయిన ప్రకృతి దృశ్యాలను చూస్తుంటే ఎంత హాయిగ వుంటుంది ?'' అసలు మనిద్దరం కల్సి అలాంటి అనుభూతుల్ని పంచుకోవాలని నేనెంతగా వువ్విళ్ళూరుతున్నా ననుకుంటున్నావు'' అంటూ మెట్లెక్కుతున్న రవి ఒక్కసారి వెనక్కు తిరిగి వసంత ముఖంలోకి గనుక చూసి వుంటే ఆమె ఆవేదన అర్థమయ్యేదే.

ఆఖరికి వసంత అననే అనేసింది ''అహా! ఇష్టంలేక కాదండి, మన బెడ్‌రూమ్‌కు ప్రక్కగా జాజి తీవె పెంచాలని నాకెంతో కోరిక.''

''ఓహో! అవా! పోనీ తొట్టిలో పెడ్తే...''

''ఉహు! దానికి తొట్టిలో స్థలం సరిపోదండి, బాగా ప్రాకుతుంది.''

''అయితే ఒక పని చెయ్యి యీ కిటికీకి సూటిగా క్రిందనే ఒక అంటు నాటు. అది పెరిగి, పెరిగి నీ దగ్గరికి ... నా కంటే ముందే నిన్ను ముద్దాడుతుందోయ్.'' అన్నాడు రవి కొంటెగా.

''మీరు మరీను. అది పెరిగి పెరిగి యిక్కడికి చేరేటప్పటికి మళ్ళీ మనకు ట్రాన్స్‌ఫర్.'' అంది కోపాన్ని సున్నితంగా ప్రదర్శిస్తూ.

''యింతలోకే ఏం రాదులేవోయ్. ప్రమోషన్ మీద వచ్చాం గదా! పోనీ యీలోపలే మరో యిల్లు వెతుకుదాం!'' అన్నాడు ఓదార్పుగా.


మళ్ళీ మరో అంటు కిటికీకి సూటిగా క్రిందనే నాటింది వసంత. అది ఏపుగా తీగలుసాగి ప్రాకి సాగింది. ఆ తీగలకు నిచ్చెనవంటి త్రాటిని అమర్చి బెడ్‌రూమ్ కిటికీ దగ్గరికి చేర్చింది. ప్రక్కకు పోతున్న తీగెలను శ్రద్ధగా ఆ త్రాటికే అల్లించేది. చెట్టు చేతికి అందకుండగ తీగలుసాగి, పైకెగబ్రాకి మొగ్గలు తొడిగింది.

జాజితీగెకులాగే వసంత గర్భంలోనూ దాంపత్య చిహ్నం అంకురించింది. నెలలు నిండేకొద్దీ, విరిసే మొగ్గల కదలికల్లా, వసంత గర్భంలోనూ కదలికలు. ఎన్నో సౌరభాలు, మరెన్నో అనుభూతులు–యింత! జాజితీగె వసంత బెడ్‌రూమ్ చేరనేలేదు ... వసంత పురిటికి వెళ్ళాల్సి వచ్చింది.

ప్రయాణం రేపనగా, ఆ రాత్రి విరిసిన జాజులను, తీగెల కదలికలను కాంక్షతో చూస్తున్న వసంతను ''అంతగా దాన్నే చూడకోయ్! జాజిమొగ్గ వంటి ఆడపిల్లనే కనేయగలవు. యీరోజుల్లో ఆడ పిల్లను కన్న తల్లిదండ్రుల అవస్థ భగీరథుని అవస్థను మించినది''...అంటున్న రవిని

''నీవంటి మంచి వ్యక్తి ఎవరో నాబిడ్డకోసం



యూపాటికి పుట్టేవుంటారు లెండి'' అంటూ పెన వేసుకుంది వసంత.

* * *

సుఖ ప్రసవంలో పాప నెత్తుకుని మూడవ నెలలో రవితో ఆటోరిక్షా ఎక్కిన వసంత, తామెక్కిన ఆటోకు మరో మార్గం చూపిస్తున్న రవితో ''అదేమిటి, ఆ యిల్లు కాదా ?'' అని ప్రశ్నించింది ఆశ్చర్యంతో.

''ఊహు! యింటి వారబ్బాయి చదువుకోసం యిక్కడికే వస్తున్నాట్ట, యిల్లు ఖాళీ చేయ మన్నారు'' అన్నాడు రవి ఎటో చూస్తూ.

''మరి ఉత్తరాల్లో జాజి తీగె కిటికీని అందు కుంది, విరగపూస్తున్నది, ఆ సువాసనలన్నీ నా ఒక్కడివే — అంటూ ఏవేవో వ్రాశేవారుగా'' అంది వసంత మరింత ఆశ్చర్యపోతూ.

''అవి, అవి, నీవు హర్టుకాకుండ'' అన్నాడు రవి వసంతను జాలిగా చూస్తూ.

మేడమీద వుండాలనే రవి కోరిక. వసంత హృదయంతో పెనవేసుకున్న జాజి తీగ — పాపం, ఆ విధంగా రెండూ దూరమయ్యాయి వారికి

ఈసారి పాపను జాగ్రత్తగ చూసుకోవటం, ఆ ముద్దు మురిపాలలో తేలిపోవటంతో, జాజి మొక్కను, మళ్ళీ నాటటానికి కాలహరణమయినా వసంత యదలోని కోరిక మళ్ళీ తీగసాగింది. ఆ క్రొత్త యింట్లో, ఆ మెట్ల ప్రక్కలనుండి, మరో అంటు తెచ్చి నాటింది. దినదిన ప్రవర్ధమాన మవుతూ — పాపలాగే కేరింతలు కొట్టసాగింది జాజి అంటు. పాపను, మొక్కను మాటి మాటికి పోల్చు కుంటు, పోషించుకుంటు వస్తున్న వసంత మనసుకు పెద్ద అఘాతం తగిలింది. అది — పాపకు చిన్నబిడ్డ చేష్టవచ్చి పోవటం, ఆ దిగులులో అశ్రద్ధ కారణంగ జాజిమొక్క కూడ నశించటం. ఖాళీ అయిన పాప ఊయలను, ఎండిపోయిన జాజి మొక్కను చూస్తూ ఆవేదనపడ్డ వసంతను చూసి ''చూడు; వసంతా ! అందుకే దేనిమీద అమితమైన అపేక్షను పెంచుకోకూడదు. పాపే లోకంగ, జాజి తీగను పెంచటమే ధ్యేయంగ — ఆ రెంటికీ నీ మనసులో ఉన్నతమయిన స్థానమిచ్చావు. అందుకే అవి అందకుండ పోయాయి. పాపకోసం నాకు

# విరితావి

మాత్రం బెంగలేదంటావా ? కాని చేసేదేముంది. మరో సంవత్సరంలో మన ఒడిలో మరో బాబుండ డంటావా ?'' అంటూ ఒకవైపు జీవిత సత్యాన్ని తెలియచేస్తూ, మరోవైపు క్రొత్త ఆశకు ప్రోది చేశాడు.

అప్పటినుండి జాజి తీగను పెంచే ఆశను, కోర్కను చంపుకుని ఎవరింట్లోనైనా కన్పిస్తే చూసి ఆనందించే స్థితికి చేరుకుంది వసంత. అంతే కాదు; తన చేత్తో పెట్టే అ తీగ తనకు దక్కదు అనే నమ్మకాన్ని పెంచుకుంది.

అంతేకాక, జాజి తీవెను నాటాలి అనే ఆలోచన పాపను మరీ మరీ గుర్తుచేస్తూ ముల్లులా గ్రుచ్చుకొనేది. అందుకే ఆ ఆలోచనను మనసు నుండి తరిమివేసింది. కాని, ఆ విరితావి, ఆ అనుభూతి వసంత మనసులో అందీ అందని వరంలా నిలబడిపోయాయి.

* * *

కాలక్రమేణా వసంత గొంతు మరో బిడ్డ 'ప్రభాకర్'కు జోలపాడింది. రవి కూడ డిపార్ట మెంటల్ పరీక్షలు పాసయి ఆఫీసర్ పోష్టు కెదిగాడు. ప్రభాకర్ కూడ వయసులోనేకాక జీవితంలోను, వృద్ధిలోకి వచ్చాడు. ప్రస్తుతం వసంతకీ జీవితం తృప్తిగానేవుంది.

''క్రొత్తగా కట్టిన యిల్లు, ఏవో ఇబ్బందుల కారణంగ అమ్ముకుంటున్నారు. నీకు నచ్చితే కొందాం, చూద్దువుగాని పద !'' అంటూ రవి భార్యను, కొడుకును, తీసుకుని వెళ్ళాడు; ఓ సాయంకాలం.

చుట్టూ ఎత్తయిన కాంపౌండ్ వాల్‌తో, అందంగ, ఆధునికంగ కట్టబడిన ఆ యింటిని కలయతిరుగుతూ, ఓ ప్రక్కగా ఉన్న విశాలమయిన గది, ఆగది కిటికీకి అందంగ అల్లుకున్న పన్నజాజి తీవె, అప్పుడే విచ్చుకుంటున్న జాజులు, గదిలోకి వ్యాపిస్తున్న ఆ పరిమళం వసంతను ఆకర్షించాయి. అర్థవంతంగ భర్త కళ్ళల్లోకి చూసింది వసంత.

ఒకర్ని, ఒకరు చూసుకుని చిర్నవ్వు నవ్వు కుంటున్న తల్లితండ్రుల్ని, వారి నవ్వులోని అంత రార్థాన్ని అర్థం చేసుకున్న ప్రభాకర్ కూడ తనలో నవ్వుకున్నాడు.

ఆ ఇంటిని కొన్న మంచి ముహూర్తమేమిటో కాని లక్ష్మివంటి కోడలు 'లక్ష్మి' గృహప్రవేశం చేసింది.

కాపరానికి వచ్చిన లక్ష్మికి ఇల్లంతా త్రిప్పి చూపిస్తూ ''ఇది మా గది అంటూ లోపలికి నడచిన అత్తగారిని అనుసరించటానికి సందేహించి అక్కడే నిలబడిపోయిన లక్ష్మిని ''రామ్మా ! ఫరవా లేదు.'' అని చేయి పట్టుకొని లోపలికి తీసుకు వెళ్ళింది, అత్తగారుగా మారిన వసంత.

పాలవెన్నెలవంటి గోడలకు ఒకవైపున అర మోడ్పు కన్నులతో మురళిని వాయిస్తున్న కృష్ణుని మోహనరూపాన్ని చూస్తూ, ఆ మృదుమధుర గానంలో పరవశమౌతున్న 'రాధాకృష్ణుల' ఫోటో, మరోవైపు 'కువకువ' మంటున్నట్లుగా వున్నపక్షుల జంట, మరోవైపు విశ్వకవి రవీంద్రుని ఫోటో, యివన్నీ గోడలకు అందాన్నివ్వడమేగాక అత్తగారి అభిరుచినిగూడ వ్యక్తపరిచాయి లక్ష్మికి.

డబుల్ కాట్‌కు ప్రక్కగావున్న కిటికీనుండి తొంగిచూసే జాజిపూలతీగె, గాలికి కదులాడే పాల నురుగువంటి మృదువయిన సిల్కు తెరలు, ఆ గది లక్ష్మి కంటికి శాంతివనంలా తోచింది.


''చాలా బాగుంది అత్తయ్యా మీగది. ఎంతో ప్రశాంతంగా వుంది'' అని మెచ్చుకుంటున్న లక్ష్మి ఒకనాటి తన కలల ప్రతినిధిగా, అనుభూతులకు ప్రతిరూపంగా కన్పించింది వసంతకు.

''అంత బావుందా'' అని చిర్నవ్వు చిందించింది.

ఆరాత్రి వసంతలో ఎన్నో ఆలోచనలు.

తనలో వసంతం వెల్లివిరిస్తున్న రోజుల్లో, యిటువంటి ఆహ్లాదకరమయిన గదికోసం, ఆ పూతీవెకోసం పలవరించింది. ఆ సుందర వాతా వరణంలో పూ పరిమళాన్ని ఆస్వాదిస్తూ, తనూ, రవి, దాంపత్య జీవితంలోని ప్రతి అనుభూతిని ఆ తీవెతో పంచుకోవాలని వువ్విళ్ళూరింది. ఆ అనుభవం, ఆ అనుభూతి, ఒక దివ్యానందంగా భావించింది. కాని విధి అనుకూలించలేదు. కాని జీవితం సంధ్యకు వ్రాలబోతున్న ఈనాటి తరుణంలో అనుకోకుండగ, అప్రయత్నంగ ఆ కోరిక నెరవేరింది.



# సంక్రాంతి

కోడిపుంజుల గొంతు కొత్త మేల్కొలుపులు
మంచుతెరల సందున మారుమ్రోగ

ముదితలందరు కలసి ముగ్గుతో మొగసాల
చిత్రవర్ణ కళల వేదివేయ

తొలి ప్రొద్దువేళలో తెలుగింటి వదుమలే
గొబ్బిళ్ళలో గుమ్మడిపూలు గుచ్చ

సాతాని జియ్యరు తాంబూర నాదాన
సమరస భావాలచవులు రేగ

సన్నాయి క్రలో సరిగమల కులుకున
పాట పల్లవితోడ గంతులాడ

ప్రాగుడ్డ పీలికలు గంగిరెద్దులకు మోత
మూపురాన "హౌద" మోవుగాగ

ఎడద పండిన పంట పైడి హొరంగుల సొరు
పులకరింతల పుడమి చిలకరింప

ఆగామి కడిమికై కడగొట్టు రుతు గళము
రాగాల రాకొట్టు పాటపాడ

తెలిమంచు గంధంపు నలుగువెట్టి
తొలిప్రొద్దు తొందరల కేశాలు విడివడి

ఉత్తరాయణ పుణ్య అంభ్యంజనారతిని
మకర రాశిని చేరె మార్తాండ విభుడు.

— సౌంధ్యశ్రీ

కాని...కాని ఈరోజు కోడలు కళ్ళల్లోను అదే కోరిక ఆహ్లాదకరమయిన గదికావాలని ఆపేక్ష. చనిపోయిన తనపాపే బ్రతికిఉంటే, పాపలోనూ యిటువంటి కోరికే ఉందని అర్థం చేసుకుని వుంటే నేనేం చేసేదాన్ని? ఏం చేసేదాన్ని?...ఏదో ఆలోచించుకుంటూ నిద్రలోకి జారింది వసంత.

* * *

మరురోజు ప్రభాకర్‌ను పిలిచి "ప్రభా ! యిక నుండి మీరు మా గది వాడుకోండిరా, క్రొత్త దంపతులు. మీకైతే బావుంటుంది. ముందు ముందు పిల్లా, పాప పుడితే విశాలంగాను వుంటుంది" అంటున్న తల్లిని విస్తుపోయి చూశాడు ప్రభాకర్.

"అదేమిటమ్మా అలా అంటావు ? ఆ గది మీ గది ... అది నాకు దేవతలు కొలువున్న దేవాలయంలా పవిత్రమైనది ... ఆ గదంటే నాకొక రకమయిన పూజ్య భావమే తోస్తుంది ... మరోలా ఎలా భావించమంటావు ? అది ఎప్పటికీ మీ గదేనమ్మా !" అనేసి వెళ్ళిపోతున్న ప్రభాకర్‌ను అప్రతిభురాలై చూస్తూ, తన మనసెరిగిన కొడుకున్న తల్లిగా గర్వించింది వసంత.

* * *

ఆ రాత్రి రవి గుర్రుపెడుతున్నా, నిద్రరాక అన్యమనస్కంగ బయటికి వచ్చిన వసంత, తమ గది ప్రక్కనే వున్న కొడుకు గదినుండి మంద్రగ వినిపిస్తున్న మాటల్లో 'అమ్మ' అన్న పదం విని నిలబడిపోయింది. ప్రభాకర్ మాటలు ఆమె చెవి సోకసాగాయి.

## విరితావి

"లక్ష్మీ ! అమ్మ, వాళ్ళ బెడ్‌రూంను మనల్ని వాడుకోమన్నది, నీవేమయినా అన్నావా ?"

"లేదండి; మీ గది చాలా బావుందని మాత్రమే అన్నాను. నిజంగ చాల నచ్చింది నాకు"

"ఉహూ! అలాగా; నీ కళ్ళల్లో కన్పడిన ఆనందం గ్రహించింది కాబోలు అమ్మ; అందుకే అలా అంది."

"ఆమెగా, ఆమే ఆ మాట అన్నారు కదా ? పోనీ మనమే అందులో వుంటే ... ?"

"వద్దు లక్ష్మీ ! వద్దు; అమ్మ అటువంటి గదికోసం ఎంతగా ఆరాటపడిందో, ఆ పూ తీవెలో ఎంతటి అనుబంధం పెనవేసుకుందో నాకు తెలుసు అసలు ఆ గది కోసమే నాన్నగారీ యింటిని కొన్నారు. ఆమె జీవితంలో కోరుకున్న యీ ఒక్క కోరిక ఫలవంతమయ్యే సమయంలో ఆ ఆనందాన్ని లాక్కోబోవటం, మనసున్న మనిషిగా, అమ్మ మనసెరిగిన వాడినిగా చెయ్యలేను. అమ్మ ఏ అనుభవాన్నయితే కావాలని మనసారా కోరుకుందో ఆ అనుభవాన్ని తృప్తిగా అనుభవించనీ లక్ష్మీ !" ప్రభాకర్ గొంతు ఆర్ద్రంగా పలికింది.

"ఈ పెద్దవయసులో వాళ్ళింకా అనుభవించబోయే దేమిటండీ ?... " లక్ష్మి కంఠం కొంటెగా ధ్వనించింది.

"చూడు లక్ష్మీ ! మనస్ఫూర్తిగా కోరుకునే అనుభవాలకి మూలం అనుభూతే. అనుభూతి రహితమయిన అనుభవం చిరస్మరణీయం కాదు. హృదయంలో గాఢంగ నాటుకున్న ఒక కోరిక, అనుభవంద్వారా లభించిన అనుభూతి నిజ జీవితంలో లభ్యం కాకపోయినా, మనసులోనే దానిగురించి ఊహించుకుంటు, ఆ ఊహల్లోనే ఆనందానుభూతిని అందుకుంటు గడుపుతారు కొంతమంది.

అటువంటి అనుభూతికి నిలయం అమ్మ హృదయం. ఆ అనుభవానికిగాని, ఆ అనుభూతికి గాని వయోపరిమితి లేదు లక్ష్మీ!

ఈరోజు మనం దాంపత్య జీవితాన్ని ఎంతో ఉత్సాహంతో, ఆనందంతో అనుభవిస్తున్నాం. అది రేపటి రోజుకు ఒక దివ్యానుభూతిగ మనలో నిల్చిపోతుంది. ఈనాటి ఆనందకరమయిన జీవితాన్ని ముసలితనంలో గుర్తుకు తెచ్చుకుని మధురంగ నవ్వుకుంటాము. అంతమాత్రాన ఆ మధురమైన ఊహలకు, ఆ అనుభూతికి అనుభవం లేదంటామా లక్ష్మీ!

అమ్మ ఒకనాటి అనుభూతిని యీనాటి అనుభవంగ మార్చుకుంటున్నది ... మనం ఈనాటి అనుభవాన్ని ముందు జీవితానికి మధురమైన అనుభూతిగా మిగుల్చుకుందాం...ఏం ?" అంటున్న కొడుకు మంచి హృదయానికి తల్లిగా ఆశీస్సులందించింది వసంత.

ఆనందపు విరితావులు మనసు నిండుగ నిండుకొనగా తృప్తిగా తమ గదివైపు నడిచింది వసంత. ★

